సాక్షి
కుమురం భీం

శుక్రవారం । 16 । ఆగస్టు । 2024



జాతీయ జెండాకు వందనం చేస్తున్న బండ ప్రకాశ్, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, హరీశ్‌బాబు, తదితరులు



గౌరవ వందనం స్వీకరిస్తున్న బండ ప్రకాశ్



ప్రత్యేక వేషధారణలో చిన్నారి



పోతరాజు వేషధారణలో విద్యార్థి



గాంధీ వేషధారణలో బాలుడు

అభివృద్ధే ధ్యేయంగా..

- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు
- అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలు అమలు
- శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్
- జిల్లా కేంద్రంలో ఘనంగా స్వాతంత్ర్య సంబురాలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



ప్రసంగిస్తున్న బండ ప్రకాశ్

జాతీయ జెండా ఎగురవేస్తున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్



భరతనాట్యం చేస్తున్న విద్యార్థినులు



భరతమాత వేషధారణలో విద్యార్థిని

ఆసిఫాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధికి పాటుపడుతున్నామని పేర్కొన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, దాసరి వేణు, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీశ్‌బాబు, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావుతో కలిసి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ జెండా ఆవిష్కరించారు. జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రగతిని చదివి వినిపించారు.

మహాలక్ష్మి పథకం

ఆడపడచులు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అమలు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 54,62,705 మంది మహిళలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని, దీని ద్వారా రూ.18,27,090ల లబ్ధి చేకూరిందన్నారు. రూ.500కే వంట గ్యాస్ అందిస్తున్నామని, జిల్లాలో 74,849 మందికి లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి, 4,779 మంది పేదలకు చికిత్స అందించామన్నారు. గృహజ్యోతి పథకం కింద 69,377 కుటుంబాలకు రూ.10.9 కోట్ల రాయితీ కల్పిస్తున్నామని తెలిపారు. రైతు రుణమాఫీ కింద 35,864 మంది రైతులకు రూ.272 కోట్ల రుణమాఫీ అమలైందని తెలిపారు. రైతుబంధు కింద 1,31,857 మందికి రూ.211 కోట్లు జమ చేశామని తెలిపారు.

గ్రామీణాభివృద్ధిశాఖ

గ్రామీణ ఉపాధిహామీ పథకంలో జిల్లాలో ఇప్పటివరకు 74 వేల కుటుంబాలకు 37.52 లక్షల పని దినాలు కల్పించి రూ.81.98 లక్షల కూలి చెల్లించామని తెలిపారు. వనమహోత్సవం కింద 35 లక్షల మొక్కలు నాటామన్నారు. గిరివికాస్ పథకంలో భాగంగా ఇందిర జలప్రభ పథకంలో ఏర్పాటు చేసిన 237 బోరు బావుల్లో 172 బావులకు విద్యుత్ సౌకర్యం కల్పించి, 143 బావులకు బోర్లు బిగించామన్నారు. టీజీ ఐపాస్ చట్టం ద్వారా ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 4 యూనిట్లు, 8 అనుమతులకు దరఖాస్తులు రాగా, 6 అనుమతులు మంజూరు చేశామన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఈజీఎస్ పథకం కింద 831 గ్రామ పంచాయతీ సీసీ రోడ్లు, భవనాలు, బాలికల మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.48 కోట్లు మంజూరు కాగా రూ.20 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద 1,258 పాఠశాలల ద్వారా నాణ్యమైన బోధన అందించడంతోపాటు 739 పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యుత్, తాగునీరు, బాలికల మరుగుదొడ్లు నిర్మించామని తెలిపారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో చేపట్టిన 330 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు తుదిదశలో ఉన్నాయన్నారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 15 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని 973 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సేవలందిస్తున్నామని తెలిపారు. ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా 88,879 మంది గర్భిణులు, బాలింతలకు ఒకపూట సంపూర్ణ భోజనం అందిస్తున్నామని వివరించారు.

గిరిజన సంక్షేమ శాఖ

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 46 ఆశ్రమ పాఠశాలలు, నాలుగు పోస్ట్ మెట్రిక్ వసతిగృహాలు, 330 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 16,164 మంది గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. ఏడు ప్రీమెట్రిక్ వసతిగృహాల్లో 434 మంది విద్యార్థులు, మూడు పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాల్లో 137 మంది విద్యనభ్యసిస్తున్నారని అన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద జిల్లాలో రెండు పాఠశాలలు ఏర్పాటు చేశామన్నారు. ఆబ్కారీ మద్య నిషేధశాఖ ఆధ్వర్యంలో 95 శాతం గుడుంబా విక్రయాలు అరికట్టి, 860 కేసులు నమోదు చేయడంతోపాటు 57 మంది వ్యక్తులను అరెస్టు చేశామని పేర్కొన్నారు. 334 గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్, నీటి ట్యాంకర్, ట్రాలీలు అందించి నిరంతర పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీస్ కింద కాగజ్‌నగర్‌లో రెండు బాలుర పాఠశాలలు, ఆసిఫాబాద్‌లో బాలికల పాఠశాల, జైనూర్‌లోని బాలికల పాఠశాల, కళాశాలలో 1820 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్ ద్వారా 134 రకాల రక్తపరీక్షలు అందుబాటులో ఉండగా.. 1,59,650 మంది నమూనాలు సేకరించి 4,61,285 రకాల పరీక్షలు చేశామన్నారు. జిల్లాను ప్రగతి పథంలో నడిపించి, అభివృద్ధికి అంకిత భావంతో పనిచేస్తున్న ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, సెయింట్ మేరీ పాఠశాల, కాగజ్‌నగర్‌లోని ఫాతిమా కాన్వెంట్ పాఠశాలల విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. కూచిపూడి, బెంగాలీ, మరాఠి, పంజాబీ, బోనాలు ఇలా సంప్రదాయ నృత్యాలు చూపరులను అబ్బురపర్చాయి. పరేడ్ కమాండెంట్ ఆర్ఐ అంజన్న ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధులు దండనాయకుల శ్రీనివాసరావును సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, సురేశ్, డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు, మాజీ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, బీజేపీ నాయకులు బోనగిరి సతీశ్‌బాబు, కొట్నాక విజయ్‌కుమార్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాం నాయక్, నాయకులు గాదెవేణి మల్లేశ్, బాలేశ్వర్ గౌడ్, అబ్దుల్లా, బద్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన ఇస్తున్న ఫాతిమా స్కూల్ విద్యార్థులు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

న్యూస్‌రీల్

మెడికల్ కళాశాల విద్యార్థుల నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదుట వైద్య విద్యార్థులు కోల్‌కతా ఘటనపై గురువారం నిరసన తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ సతీశ్‌కుమార్ మాట్లాడుతూ వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడి హత్య చేయడం దారుణమన్నారు. అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడే వైద్యులపై దాడులు అరికట్టాలన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అధ్యాపకులు సత్యం, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

20 వార్డులతో ఆసిఫాబాద్ మున్సిపాలిటీ

ఆసిఫాబాద్: నూతన ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో 20 వార్డులను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజపత్రం యాక్ట్ నంబర్ 5 ప్రకారం ఆసిఫాబాద్, జన్కాపూర్, గొడవెల్లి గ్రామాలతో ఆసిఫాబాద్ పురపాలక సంఘం ఏర్పాటు చేయాలని కమిషనర్, సంచాలకులు పురపాలక పరిపాలన శాఖ హైదరాబాద్ పేరిట ఉత్తర్వులు జారీ అయ్యాయని మున్సిపల్ కమిషనర్ భుజంగరావు తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో గురువారం జీవో ప్రతిని ప్రదర్శించారు. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 20 సాయంత్రం 5 గంటలలోపు పురపాలక సంఘ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

మూడో విడతలో 11,933 మందికి లబ్ధి

- ఖాతాల్లోకి రూ.157.21 కోట్లు

ఆసిఫాబాద్: రాష్ట్ర ప్రభుత్వం గురువారం మూడో విడత రుణమాఫీ అర్హుల జాబితాను ప్రకటించింది. జిల్లాలో 11,933 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. కాంగ్రెస్ సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గత నెల 17న తొలి విడత రుణమాఫీని ప్రారంభించింది. అనంతరం రూ.1.5 లక్షలు తీసుకున్న వారి ఖాతాల్లో నగదు జమ చేశారు. మూడో విడతలో భాగంగా రూ.2లక్షల లోపు రుణాలు తీసుకున్న వారి ఖాతాల్లో మాఫీ నగదు జమ చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మూడో విడతలో 11,933 ఖాతాల్లో 157,23,66,214 నగదు జమ చేయనున్నారు. దీని ద్వారా 9,578 కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. కాగా.. తొలివిడతలో 22 వేల మందికి రూ.125.20 కోట్లు, రెండో విడతలో 14,623 మంది రైతులకు 153.34 కోట్లు మాఫీ చేశారు.

'భగీరథ' పంపు హౌజ్‌కు తాళం

పెంచికల్‌పేట్(సిర్పూర్): మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న ఆపరేటర్లకు తొమ్మిది నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో సమ్మెకు దిగారు. ఈ క్రమంలో పెంచికల్‌పేట్ మండలం కమ్మర్‌గాం వద్ద మురళీగూడ, జిల్లెడ గ్రామాలకు నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన పంపుహౌజ్‌కి తాళం వేశారు. సమస్య పరిష్కరించే వరకు నీటి సరఫరా చేసేది లేదని ఆపరేటర్లు బాపు, రవి స్పష్టం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో గిరిజన గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిపివేయడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

అమరుల త్యాగాలు స్మరిద్దాం

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



జెండా వందనం చేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్‌అర్బన్: స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో మహానుభావులు జీవితాలు, ప్రాణాలు త్యాగం చేశారని, అలాంటి అమరులను స్మరించుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయ ఆవరణలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జాతీయ జెండా ఆవిష్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో మహనీయుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. విధుల్లో ప్రతిభ చూపిన పోలీసులకు ప్రశంసాపత్రాలు అందించారు. పెద్దయ్య(ఆర్ఐ అడ్మిన్), మధుకర్ (ఎస్సై, కౌటాల), ప్రవీణ్‌కుమార్ (ఎస్సై, లింగాపూర్), మహేందర్ (ఎస్సై, కాగజ్‌నగర్‌రూరల్), వెంకటేశ్ (ఎస్సై, టాస్క్‌ఫోర్స్), ఓదేలు (ఆర్ఎస్సై, ఆపరేషన్), సందీప్ (ఆర్ఎస్సై, స్పెషల్ పార్టీ), లవన్‌కుమార్ (ఆర్ఎస్సై స్పెషల్ పార్టీ)తోపాటు 33 మంది పోలీసు సిబ్బంది ప్రశంసాపత్రాలు అందుకున్నారు. అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, డీసీఆర్బీ సీఐ రాణాప్రతాప్ ఉన్నారు.

కార్యాలయాల్లో జెండా రెపరెపలు



కలెక్టరేట్ ఆవరణలో జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో గురువారం జాతీయ జెండా ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంపీ రమేశ్, ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ భుజంగరావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు తన నివాసంలో, ఆర్టీసీ డిపోలో డీఎం విశ్వనాథ్ జెండా ఆవిష్కరించారు. జాతీయ గీతం ఆలపించారు.



జెడ్పీ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి



గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంపీ రమేశ్

ఆకట్టుకున్న స్టాళ్లు, శకటాలు



వెదురుతో చేసిన జ్ఞాపికను బండ ప్రకాశ్‌కు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్



ఆర్టీసీ ఆధ్వర్యంలో ఉచిత బస్సు శకటం

ఆసిఫాబాద్‌రూరల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో గురువారం ఏర్పాటు చేసిన స్టాళ్లు, శకటాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌తోపాటు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీశ్‌బాబు, అధికారులు స్టాళ్లను సందర్శించి తయారీ విధానం, ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల్లో చేపట్టిన పనులు, వరి గడ్డితో మొక్కలు పెంచే కుండీల తయారీ, స్వచ్ఛమైన గాలి తయారీ, రూం టు రీడ్ కథల పుస్తకాల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహారం స్టాళ్లు ప్రదర్శించారు. ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ ద్వారా ఆయిల్‌పాం సాగు చేస్తున్న రైతులకు అందిస్తున్న పనిముట్లు, బీసీ వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో వెదురుబొమ్మలు, ఫోన్ స్టాండ్లు, బొకేలు, బుట్టలు, తెలంగాణ సంస్కృతిని తెలిపే జంతువులు, పక్షుల బొమ్మలు ప్రదర్శించారు. జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో తేనె, గర్భిణులకు పౌష్టికాహారం, మిల్లెట్స్ స్టాళ్లు ఏర్పాటు చేశారు. అలాగే ఆర్టీసీ ఆధ్వర్యంలో ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి శకటం, వైద్యశాఖ ఆధ్వర్యంలో 108 102 వాహనాల ప్రదర్శన, పశువైద్యశాఖ ఆధ్వర్యంలో 1962 సంచార వాహనాలు, పాఠశాలలు, వసతి గృహ విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించే ఆలనా వాహన శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

క్లుప్తంగా

ద్విచక్ర వాహనం దహనం


దహనమైన బైక్

తిర్యాణి: గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని దహనం చేసిన సంఘటన మండలంలోని మాలగూడలో చోటు చేసుకుంది. ఎస్సై మాధవ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దుర్గం శ్రీనివాస్ బుధవారం రాత్రి తన బైక్‌ను ఇంటిముందు పార్క్‌చేసి ఉంచాడు. గుర్తు తెలియని వ్యక్తులు వాహనంపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. దీంతో బైక్‌తో పాటుగా పక్కనే ఉన్న దుస్తులు, తడకలు కాలిపోయాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్య

ఆసిఫాబాద్‌రూరల్: మనస్తాపంతో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని వావుదాం గ్రామానికి చెందిన కుర్సింగ ఆత్మారాం (30)కు ఇద్దరు కుమారులు సంతానం. ఇటీవల పెద్దకుమారుడు అనారోగ్యంతో మృతి చెందగా మనస్తాపంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో బుధవారం చిన్న కుమారుడిని బైక్‌పై ఎక్కించుకుని జిల్లా కేంద్రానికి వచ్చి వెళ్తుండగా గ్రామ సమీపంలో అదుపుతప్పి కిందపడ్డారు. కుమారుడికి గాయాలు కావడంతో మద్యం సేవించి బండి నడపడంతోనే ఘటన చోటు చేసుకుందని అతని భార్య రుక్మిణి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన ఆత్మారాం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. రుక్మిణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. హాజీపూర్ మండల కేంద్రానికి చెందిన చిప్పకుర్తి పోషమ్మ(68) బుధవారం రాత్రి హాజీపూర్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద జాతీయ రహదారి దాటుతుండగా అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. వృద్ధురాలికి తీవ్ర గాయాలు కావడంతో 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి అల్లుడు మల్యాల రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రూటర్ దొంగిలించిన నిందితుడి రిమాండ్

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఆంధ్రాకాలనీ వద్ద ఈ నెల 8న జియో సెల్ టవర్ రూటర్ దొంగిలించిన నిందితుడిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నరేందర్ తెలిపారు. బిహార్‌కు చెందిన హేశామొద్దీన్ ఉపాధి నిమిత్తం పట్టణానికి వచ్చి సెల్ టవర్‌లో ప్రైవేటు టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. కొద్దిరోజులుగా వ్యసనాలకు అలవాటుపడి దొంగతనాలకు పాల్పడుతున్నాడు. సెల్ టవర్‌ల రూటర్‌లను దొంగిలించి విక్రయిస్తుండేవాడు. టవర్ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హేశామొద్దీన్‌పై కేసు నమోదు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువతి మృతి


దీప (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర టాకీస్ చౌరస్తా వద్ద ఈ నెల 5న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సు రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొన్న ఘటనలో గాయాలపాలైన యువతి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు స్థానిక సాయికుంటకు చెందిన రేగుంట రమేష్, అతని కూతురు దీప (24), భూపాలపల్లి జిల్లా బండ్లపల్లి గ్రామానికి చెందిన బండి మహేష్, శ్రీరాంపూర్ ఆర్కే6 కాలనీ కొత్తరోడ్‌కు చెందిన బీ. నవీన్ ద్విచక్ర వాహనాలపై వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. రమేష్, దీపకు తీవ్ర గాయాలుకావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. తండ్రీ కూతుళ్లకు వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతూ దీప గురువారం మృతి చెందింది. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన దీప జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఉద్యోగం కోసం వెళ్తుండగా ప్రమాదానికి గురైంది.

ఉత్తములకు 'ప్రశంస'

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో గురువారం పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంకిత భావంతో విశిష్ట సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగులకు శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్ ప్రశంసాపత్రాలు అందించారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీశ్‌బాబు, అధికారులతో కలిసి 135 మందికి ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు.


ప్రశంసాపత్రం అందుకుంటున్న అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి


ప్రశంసాపత్రం అందుకుంటున్న అదనపు కలెక్టర్(రెవెన్యూ) దాసరి వేణు


ప్రభాకర్‌రావు, ఏఎస్పీ


సదయ్య, డీఎస్పీ, ఆసిఫాబాద్


కరుణాకర్, డీఎస్పీ, కాగజ్‌నగర్


ప్రవీణ్, డిప్యూటీ రేంజ్ అధికారి(అటవీశాఖ)


సుజాత, వెలుగు సీసీ


కె.సురేశ్, ఆర్డీవో, కాగజ్‌నగర్


లోకేశ్వర్‌రావు, ఆర్డీవో, ఆసిఫాబాద్


రాణాప్రతాప్, టాస్క్‌ఫోర్స్ సీఐ


సతీశ్‌కుమార్, సీఐ, ఆసిఫాబాద్


రమేశ్, సీఐ, జైనూర్


ఫసియొద్దీన్, ఏఎస్సై, ఆసిఫాబాద్


అన్వర్‌ఖాన్, డ్రైవర్, ఆర్టీసీ


దేవేంద్ర కుమారి, కండక్టర్, ఆర్టీసీ


రవికుమార్, మెకానిక్, ఆర్టీసీ


తోటాజీ, జెడ్పీ కార్యాలయ సూపరింటెండెంట్


రమేశ్, టైపిస్ట్, డీపీఆర్వో కార్యాలయం


పోచయ్య, డీటీ, ఆసిఫాబాద్


చిన్ను, ఆర్ఐ, ఆసిఫాబాద్


తిరుపతి, సీఆర్టీ, ఆసిఫాబాద్


మోహన్‌నాయక్, కళాకారుడు


మక్సూద్, అటవీశాఖ కార్యాలయ సిబ్బంది


వేముల మల్లేశ్, ఎంపీడీవో, తిర్యాణి


రవికాంత్, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది


ప్రభాకర్, జేఎల్, జైనూర్


పుష్ప, సీనియర్ అసిస్టెంట్, ఆర్అండ్‌బీ


గంటా రాము, ఏఈవో


మధు, టాస్క్‌ఫోర్స్ పీసీ


కె.మాన్కు, కంప్యూటర్ ఆపరేటర్, లింగాపూర్

అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి



ఉత్తమ ఉద్యోగులను సన్మానిస్తున్న జీఎం సంజీవరెడ్డి

- జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తూ దేశ పారిశ్రామిక అభివృద్ధిలో సింగరేణి ఉద్యోగులు భాగస్వామ్యం కావాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అన్నారు. గురువారం జీఎం కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి దేశ పారిశ్రామిక అవసరాలను తీరుస్తుందన్నారు. ప్రతీ ఉద్యోగి రక్షణతో పనిచేసి సంస్థను మరింత ముందుకు నడిపించాలన్నారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియాలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను సన్మానించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కే.వెంకటేశ్వర్ రెడ్డి, ఏరియా ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, ఇందారం ఓపెన్ కాస్ట్ గని ప్రాజెక్టు అధికారి ఏవీ రెడ్డి, శ్రీరాంపూర్ ఓసీపీ పీవో శ్రీనివాస్, ఏజెంట్లు గోపాల్ సింగ్, రాముడు, శ్రీధర్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎంలు అరవిందరావు, ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి పథకంతో అభివృద్ధి


ప్రారంభిస్తున్న హర్కర వేణుగోపాల్ రావు

మంచిర్యాలఅగ్రికల్చర్: మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ప్రభుత్వం చేపట్టిన ఇందిరా మహిళా శక్తి పథకంతో ఆర్థిక అభివృద్ధి దిశగా మహిళలను ప్రోత్సహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు హర్కర వేణుగోపాల్‌రావు అన్నారు. గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని స్నేహాలత గ్రామైక్య సంఘం -హాజీపూర్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా రూ.6 లక్షల రుణ సదుపాయంతో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, డీసీపీ భాస్కర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావులతో కలిసి ప్రారంభించారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్య


శ్రీధర్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రం మంచిర్యాలలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. మద్యం మత్తులో ఒకరు, భార్య వదిలి వెళ్లిందని మరొకరు, అప్పుగా ఇచ్చిన డబ్బు తిరిగి రాలేదని ఇంకొకరు బలవన్మరణానికి పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని అశోక్‌రోడ్డుకు చెందిన లెక్కల మహేష్(60) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సనత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహేష్ కొద్ది రోజులుగా పని చేయకుండా జులాయిగా తిరుగుతుండే వాడు. మద్యానికి బానిసయ్యాడు. గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.


జాఫర్‌నగర్‌లో..

జిల్లా కేంద్రంలోని జాఫర్‌నగర్‌కు చెందిన శుభం మండల్(26) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక ఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం.. శుభం మండల్ కొద్ది రోజులుగా మద్యానికి బానిసై పని చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. దీంతో భార్య అంజూమ్ మండల్ పది రోజుల క్రితం తన పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన శుభం మండల్ గురువారం సాయంత్రం మద్యం మత్తులో ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

హమాలీవాడలో..

జిల్లా కేంద్రంలోని హమాలీవాడకు చెందిన తోగరి శ్రీధర్(36) గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక ఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీధర్ తన స్నేహితుల్లో కొందరికి సుమారు రూ.40లక్షల వరకు అప్పుగా ఇచ్చాడు. స్నేహితులు తిరిగి ఇవ్వకపోవడం, ఇబ్బందులకు గురి చేయడంతో మనస్తాపం చెంది ఈ నెల 12న మద్యంమత్తులో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలి


సర్టిఫికెట్ అందజేస్తున్న అదనపు కలెక్టర్

తాండూర్: అపోహలు వీడి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. గురువారం మండలంలోని సురభి గోధా క్షేత్ర ఫంక్షన్ హాల్‌లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి రక్తదానం చేశారు. 201 యూనిట్ల రక్తాన్ని దాతల నుంచి సేకరించారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో ప్రభాకర్, సీఐ కుమారస్వామి, సురభి శరత్ పాల్గొన్నారు.

యాభై అడుగుల ఎత్తులో జెండా ఆవిష్కరణ


ఎగురుతున్న జాతీయ జెండా

బెల్లంపల్లి: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం బెల్లంపల్లి పాత బస్టాండ్ చౌరస్తా వద్ద 50 అడుగుల ఎత్తులో జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు. జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన జాతీయ జెండాను మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత ఎగుర వేశారు. ప్రజల్లో జాతీయ భావాన్ని కలిగించాలనే ఉద్దేశంతో పట్టణ నడిబొడ్డున జెండాను ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. అంతకుముందు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవాసమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు స్వామి, బీజేపీ నాయకుడు రాజులాల్ యాదవ్, పాల్గొన్నారు.

వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

పాతమంచిర్యాల: ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వీవోఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే.రాజ్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో జిల్లా స్థాయి వీవోఏల సమావేశం నిర్వహించారు. వీవోఏల సంఘం అధ్యక్షుడు కుంటాల కుమార్, నాయకులు భాగ్యలక్ష్మి, రాజ్యలక్ష్మి, లావణ్య, అనూష, మహేష్, సమ్మన్న, శంకర్, లక్ష్మణ్‌దాస్, వెంకటి, వెంకటస్వామి, పోషన్న, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల మహేష్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో భైంసా విద్యార్థి ఆత్మహత్య

భైంసాటౌన్: పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి నవదీప్(16) హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు నవదీప్ పదోతరగతి వరకు ముధోల్‌లోని సాంఘిక సంక్షేమ బీసీ బాలుర గురుకుల పాఠశాలలో చదువగా రంగారెడ్డి జిల్లా గౌలిదొడ్డిలోని సీఓఈ(కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్)లో సీటు రావడంతో ఇంటర్ ఫస్టియర్‌లో చేరాడు. ఈ క్రమంలో ఇటీవల సెలవుల నిమిత్తం భైంసాలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చి తిరిగి వెళ్లేందుకు హైదరాబాద్‌లోని తన సోదరుడి వద్దకు వెళ్లాడు. గురువారం ఉదయం సోదరుడి గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసిన భైంసాలోని విద్యార్థి తండ్రి గడపాలే దేవిదాస్ స్పృహ తప్పి పడిపోగా పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

హత్య కేసులో ముగ్గురి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాశ్

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని గురునానక్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఈ నెల 13న జరిగిన హత్య కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ ప్రకాశ్ తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. సబ్బెపల్లికి చెందిన బియ్యం వ్యాపారి దేవయ్య (37) అదే గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. విషయం సదరు మహిళ భర్తకు తెలియడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. తమ తమ్ముడి చావుకు కారణమైన దేవయ్యను హతమార్చాలని కోట సత్తయ్య, కోట అంజన్న, కోట సాయిలు నిర్ణయించుకున్నారు. ముగ్గురూ కలిసి ఈ నెల 13న దేవయ్య కనిపించడంతో మాయమాటలు చెప్పి అతనితో కలిసి రాత్రి వరకు మద్యం సేవించారు. ఆతర్వాత ఇనుప పైపుతో దేవయ్య తలపై బలంగా కొట్టి హత్య చేశారు. దేవయ్య భార్య రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు గురువారం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో సీఐ నరేందర్, ఎస్సై సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

పంటచేలోనే ప్రాణాలొదిలాడు

- పిడుగుపాటుతో వలసకూలీ మృతి
- న్యాయం చేయాలని బాధిత కుటుంబం ఆందోళన


పత్తి చేనులో హన్మంతు మృతదేహం

తాండూర్: బతుకుదెరువుకోసం వలస వచ్చిన వ్యవసాయ కూలీ పిడుగుపాటుతో మృతి చెందిన విషాద సంఘటన గురువారం మండలంలోని అచ్చులాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం కొమురవెల్లి గ్రామానికి చెందిన ఇట్యాల హన్మంతు (34) కొంత కాలం క్రితం భార్య, నలుగురు పిల్లలతో కలిసి మంచిర్యాల జిల్లా భీమిని మండలం రాంపూర్ గ్రామానికి వలస వచ్చాడు. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం అచ్చులాపూర్‌కు చెందిన పొట్లపల్లి రాజిరెడ్డి అనే రైతు పత్తి చేనులో క్రిమిసంహారక మందు పిచికారీ చేయడానికి వెళ్లాడు. మందు పిచికారీ చేస్తుండగా ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి పిడుగు పడడంతో హన్మంతు అక్కడికక్కడే మృతి చెందగా రాజిరెడ్డి భార్య మల్లక్క స్పృహ కోల్పోయింది. విషయం తెలుసుకున్న రాజిరెడ్డి ఘటనాస్థలికి చేరుకుని మల్లక్కను ఆసుపత్రికి తీసుకెళ్లాడు. భర్త మరణ వార్త తెలుసుకున్న హన్మంతు భార్య, పిల్లలు మాకెవరు దిక్కని మృతదేహంపై పడి బోరున విలపించారు. తమకు పరిహారం చెల్లించాలని బాధిత కుటుంబ సభ్యులు మృతదేహంతో ధర్నా నిర్వహించారు. పోలీసులు ఎంత చెప్పినా వినకుండా కారు చీకట్లో మృతదేహంతో రోదించడం గ్రామస్తులను తీవ్రంగా కలిచివేసింది. మృతునికి భార్య సుజాత, నలుగురు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై ఎస్సై డి.కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా హన్మంతు మృతిపై ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు.

వేతనం రాక ఆగిన ఊపిరి

- గుండెపోటుతో మిషన్ భగీరథ వాటర్ మెన్ మృతి
- ఏడు నెలలుగా జీతం ఇవ్వని కాంట్రాక్టు సంస్థ
- కుటుంబ పోషణకు అప్పులు.. మానసిక ఒత్తిడి..
- మృతదేహంతో బంధువుల ఆందోళన


ప్రభాకర్ మృతదేహం

ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ముధోల్: ఏడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో మిషన్ భగీరథ వాటర్‌మెన్ మానసిక ఒత్తిడికి లోనై గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పందిర్ల ప్రభాకర్ (38) ఫిల్టర్‌బెడ్ నిర్వహణ చూసుకునే ఓ ప్రైవేటు ఏజెన్సీ తరఫున వాటర్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఏజెన్సీ సిబ్బందికి ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. ఈ క్రమంలో ప్రభాకర్ మానసిక ఒత్తిడికి లోనయ్యాడు. గురువారం గుండెపోటుతో మృతిచెందాడు.

మృతదేహంతో ఆందోళన..

వేతనం రాకపోవడంతోనే ప్రభాకర్ గుండెపోటుకు గురై మృతిచెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు మృతదేహాన్ని ఫిల్టర్ బెడ్ వద్దకు తీసుకెళ్లారు. అక్కడే ఉంచి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఆందోళన చేశారు. మిషన్ భగీరథ ఏఈఈ సుమన్, ఏజెన్సీ ప్రతినిధి అజయ్ అక్కడి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై సాయికిరణ్ అక్కడి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. ఇరు వర్గాల మధ్య రాజీ కుదరకపోవడంతో రాత్రి 8 గంటల వరకు మృతదేహంతో ఆందోళన కొనసాగించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్య

బోథ్: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ గంగారెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని సాకెర గ్రామానికి చెందిన జాదవ్ భరత్(50) నాలుగేళ్ల క్రితం పెద్ద కుమార్తె, రెండేళ్ల క్రితం చిన్న కుమార్తె వివాహం జరిపించాడు. పెళ్లిళ్లతో పాటు పంటల సాగుకోసం అప్పు చేశాడు. తీర్చేమార్గం కనిపించకపోవడంతో కొన్నిరోజులుగా మనస్తాపానికి గురవుతున్నాడు. గురువారం మధ్యాహ్నం తన చేనులో పురుగుల మందు తాగాడు. ఫోన్ చేసినా ఎత్తక పోవడంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా చేనులో పడిపోయి ఉన్నాడు. వెంటనే మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య విజయ బాయిఇచ్చినఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో గంగారెడ్డి తెలిపారు.